క్లుప్తంగా

ప్రజావాణికి అధికారులు హాజరుకావాలి

కోడేరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు తమ సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు.

వేసవి శిబిరాలకు ఏర్పాట్లు పూర్తి

లింగాల: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు నెలరోజుల పాటు వేసవి అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పీఈటీ ఎండీ. అబ్దుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు శిక్షణలో తర్ఫీదు తీసుకోవచ్చని, వివరాలకు 9014145580 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శిక్షణను వినియోగించుకోవాలి

వెల్దండ: తక్షశిల పాఠశాలలో శృతిలయ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూపతిరెడ్డి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆట, పాటలు ఎంతో అవసరమన్నారు. వేసవిలో సెలవు దినాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు కల్చర్ శిక్షణ తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్, అకాడమీ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్, రమేష్, సంతోష్, శ్రీరామ్, జ్యోతి, సుజాత తదితరులు ఉన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం



కల్వకుర్తి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వేసవి కరాటే క్యాంపును మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కల్వకుర్తి సీఐ సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడారు. కరాటేతో స్వీయ రక్షణ లభిస్తుందన్నారు. కౌన్సిలర్ సైదులుగౌడ్, వైస్ చైర్మన్ షాహెద్, మధు పాల్గొన్నారు.


సబ్సిడీ చెక్కు పంపిణీ

కొల్లాపూర్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెక్కును ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్ పసుపుల కృష్ణ, మాజీ మార్కెట్ చైర్మన్ నరేందర్‌రెడ్డి లబ్ధిదారురాలకు అందజేశారు. నాలుగో వార్డుకు చెందిన కర్నె లక్ష్మీకి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.50 వేల చెక్కు వంద శాతం సబ్సిడీపై మంజూరైంది. అన్‌స్కిల్డ్ యూనిట్ల ద్వారా దళితుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోందని ఈ సందర్భంగా నాయకులు వివరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిజ్జ దశరథం, నాయకులు మధు తదితరులున్నారు.

యూనియన్‌కు సహకరించాలి

కందనూలు: స్వర్ణకార యూనియన్ సభ్యత్వం తీసుకొని యూనియన్ అభివృద్ధికి సహకరించాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి అన్నారు. ఆదివారం సంఘం సభ్యత్వం రశీదులను సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సభ్యత్వం తీసుకున్న సభ్యుడు యూనియన్ ఐడీ కార్డు పొందాలన్నారు. కేశవాచారి, రమేష్, రాజు, శేఖర్, బ్రహ్మం, జంగాచారి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కందనూలు: మెకానిక్ యూనియన్ సభ్యుడు నాగరాజు కుమారుడు లోకేష్ బాబు బోన్ క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న టౌన్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని నాగారాజుకు రూ.16,616 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శేఖర్ రెడ్డి మాట్లాడారు. కర్ణ, చిన్నా, ఖాజా, పాషా, బర్కత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: కల్వకోల్‌కి చెందిన కద్దాల నర్సింహ అనారోగ్యంతో మృతిచెందాడు. కొల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు ఇచ్చిన రూ.5 వేలను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రసూల్ బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. వెంకటస్వామి, రామకృష్ణ, లక్ష్మయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

కల్వకుర్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్ తండాకు చెందిన సురేష్ అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యుడు ఆదివారం తండాకు వెళ్లి సురేష్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. సామాజిక సేవలో మిత్ర ఫౌండేషన్ ప్రత్యేకంగా నిలుస్తుందని సభ్యులు తెలియజేశారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



అచ్చంపేటలో పూజలు చేస్తున్న భక్తులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 330వ ఆరాధనోత్సవాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, గణపతిపూజ, అభిషేకం, సర్వతాదేవతా పూజ, బ్రహ్మంగారి సహస్రనామార్చన, కుంకుమార్చన, యజ్ఞం, పూర్ణాహుతి, మహానైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటటీ అధ్యక్షుడు లింగాచారి, ప్రధాన కార్యదర్శి మదనాచారి, వీరాచారి, కల్పన, అర్చన, విద్యావతి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన కార్యక్రమంలో భాగంగా మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బ్రహ్మంగారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూలమాలలతో ర్యాలీ నిర్వహించారు. వీరాచారి, భాస్కరాచారి, బాలకృష్ణ, అనంతరాములు, తిరుపతాచారి పాల్గొన్నారు.

తెలకపల్లి: బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెలకపల్లిలోని విశ్వబ్రాహ్మణ వీధిలోని అర్చకులు, పురోహితులు ఉమాపతి ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

వెల్దండ: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, విష్ణు సహస్ర నామ యజ్ఞం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ భూపతిరెడ్డి, జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విజేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాసరపు వెంకటయ్య, మల్లయ్య, మట్ట వెంకటయ్యగౌడ్, అన్నదాన కృష్ణయ్య, పాండుచారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు బ్రహ్మంగారి ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రసాద్, జంగయ్యచారి, కృష్ణ, రాఘవేందర్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మురళీ, హరీష్, భక్తులు పాల్గొన్నారు.



లింగాలలో..



వెల్దండ ఆలయంలో పూజలు



తాడూరులో పూజలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెంట్లవెల్లిలో..



కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్: చిన్నప్పుడు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనంతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గతాన్ని నెమరువేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ డైరెక్టర్ శ్రీకాంత్, జమ్ముల శ్రీకాంత్, కిరణ్, సందీప్, అరుణ్, మురళీ, నసీమా, రాధిక పాల్గొన్నారు.

రఘుపతిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో

మండలంలోని రఘుపతిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996–97 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని సంతోషంగా జరుపుకొన్నారు. పాఠశాల తీపి గుర్తులను నెమరేసుకొని సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో సంతోషంగా గడిపారు. అకాల మరణం పొందిన వారి స్నేహితుడు బ్రహ్మాచారీ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రవీణ్, శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రవివర్మ, జైపాల్‌రెడ్డి, జంగిరెడ్డి, అమృత, జ్యోతి, కవిత, స్వర్ణలత పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రం జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ హైస్కూల్ 1993–94లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పెంట్లవెల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వారు ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పలువురు మాట్లాడారు. మా గురువులు మాకు బోధించిన విద్యతో ఈ రోజు మేము ఒక్కొక్కరం ఒక్కో స్థాయిలో ఉన్నామన్నారు. వారు చెప్పిన విద్యతో సమాజంలో ఉన్నతంగా ఉన్నామని పలువురు వారి అభిప్రాయాలు తెలియజేశారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

తెలకపల్లి: పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని వారి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తెలకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–79 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. దేవదానం, రామచంద్రారెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాంశెట్టి తదితరులు పాల్గొన్నారు.



రఘుపతిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో



తెలకపల్లిలో..

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే

కొల్లాపూర్: మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు. రైతులు కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, తేమశాతం వచ్చేవరకు ధాన్యాన్ని ఆరబెట్టాలని సూచించారు. తేమ శాతం ఉన్న కూడా ధాన్యం కొనుగోలు చేయకుండా ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, పరశురామ్‌గౌడ్ తదితరులున్నారు.

బీఎస్పీతోనే రాజ్యాధికారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: బడుగుబలహీన వర్గాలకు బీఎస్పీతోనే రాజ్యాధికారం వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహేంద్రనాథ్ చౌరస్తా వద్ద తెలంగాణ భరోసా బహిరంగ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 7న బీఎస్పీ జాతీయ నాయకురాలు మాయావతి తెలంగాణ భరోసా బహిరంగ సభకు హాజరవుతున్నారని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ మండల అధ్యక్షుడు కళ్యాణ్, కృష్ణ, నాగార్జున, శ్రీనివాసులు, ప్రకాష్, మోహన్‌రెడ్డి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులను ఆర్థికంగా ఆదుకోవాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న రవీంద్రాచారి

నాగర్‌కర్నూల్ రూరల్: నగల తయారీ వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న స్వర్ణకారులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని స్వర్ణకారుల సంఘం జిల్లా కార్యదర్శి రవీంద్రాచార్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఉండే స్వర్ణకారులందరూ సభ్యత్వ నమోదును చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం జిల్లా నాయకులు రజితమూర్తి, కేశవాచారి, రమేష్, మణ్యంచారి, రవి, శేఖర్, బ్రహ్మం పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో చోరీలు

బిజినేపల్లి: మండలంలోని వసంతాపూర్, పాలెం గ్రామాలకు చెందిన హంసకళ, ఖాజాబానుల ఇంట్లో రెండు వేర్వేరు దొంగతనాలు చోటు చేసుకోగా.. వాటిపై బిజినేపల్లి ఎస్‌ఐ కృష్ణ ఓబుల రెడ్డి ఆదివారం కేసు నమోదు చేశారు. చోరీకి సంబంధించిన నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో పగడాల నిరంజన్, సలీంలు దొంగతనానికి పాల్పడగా.. వారిని పోలీసులు తమదైన పద్ధతిలో విచారణ చేసి వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో కీలకంగా పనిచేసిన ఏఎస్‌ఐ వెంకటస్వామి, సిబ్బంది సయ్యద్ అలీ, నరసింహ, రవీందర్, శ్రీనివాస్‌లకు రివార్డును ఎస్‌ఐ కృష్ణ ఓబులరెడ్డి అందజేశారు.

తల్లీకుమారుల ఆచూకీ లభ్యం



ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లిలో రెండు రోజుల కిందట భర్తతో గొడవపడి కనిపించకుండ పోయిన కావలి వరలక్ష్మి, ఇద్దరు కుమారులు అక్షయ్, సాయిల ఆచూకిని ఆదివారం గుర్తించినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా ఈగలపెంట, శ్రీశైలం పోలీసుల సహకారంతో తల్లీకుమారులు శ్రీశైలంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. వారి కుటుంబ సభ్యుల సాయంతో వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. తల్లీకుమారులను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

కోడేరు: మండలంలోని రాజాపూర్‌కి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వడ్డె సీతారాములు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కిషన్‌నాయక్, రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

తరలిన నాయకులు

చారకొండ: స్వరాజ్య పాదయాత్ర హైదరాబాద్‌లోని ముగింపు సభకు మండలంలోని చారకొండ, జూపల్లి, సిర్సనగండ్ల ఆయా గ్రామాల నుంచి డీఎస్పీ నాయకులు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. అంతకు ముందు జూపల్లి, చారకొండలో డీఎస్పీ జెండా ఆవిష్కరించారు. సభకు వెళ్తున్న వాహనాన్ని సీనియర్ నాయకులు మాడ్గుల బాలస్వామి జెండా ఊపి ప్రారంభించారు. విజయ్, రాధాకృష్ణ, మల్లిఖార్జున్, ప్రశాంత్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

కల్వకుర్తిరూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు వరిచేను, మామిడితో పాటు అకాల వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతింది. ఆరబెట్టిన మొక్కజొన్నపై వర్షం కురవడంతో మొక్కజొన్న పంట దెబ్బతిందని బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి శివ ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని తుర్కలపల్లిలో వర్షానికి తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు.



మేడేను జయప్రదం చేయండి



తాడూరులో మాట్లాడుతున్న పర్వతాలు

నాగర్‌కర్నూల్ రూరల్: కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 26 కార్మిక చట్టాలను నరేంద్రమోదీ 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్య, కోశాధికారి అశోక్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల కార్మికులందరూ ఏకమై సోమవారం నిర్వహించే మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 137వ మేడే ప్రాధాన్యతతో కూడుకుందని గతంలో ఎన్నడూ లేనివిదంగా కార్మికులపై దమనకాండ కొనసాగుతుందని విమర్శించారు. కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని, 26 కార్మిక చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాలుగు లేబర్ కోర్డులుగా మార్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులను కాపాడుకునేందుకు భవిష్యత్ పోరాటాలు నిర్వహిస్తామని కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమిస్తామన్నారు. సీపీఎం నాయకులు కాశన్న, శ్యాంసుందర్, కృష్ణయ్య, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత జయంతి



కల్వకుర్తిలో అమ్మవారి పల్లకీ సేవ



అమ్రాబాద్‌లో హోమం నిర్వహిస్తున్న భక్తులు

కల్వకుర్తి: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం వాసవీ మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ప్రత్యేక పూజలు, అభిషేకంతో కార్యక్రమాలు ప్రారంభించారు. కుంకుమార్చన, భగవద్గీత పారాయణం, వాసవీమాత పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జూలూరి రమేశ్‌బాబు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఆర్య వైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి రమేశ్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన, అభిషేకాలు

మన్ననూర్: ఆర్యవైశ్యుల ఆత్మగౌరవానికి ప్రతీక, కులదేవత కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి పుట్టిన రోజు వేడుకను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో అమ్మవారి చిత్ర పటం ఉంచి కుంకుమార్చన, అభిషేకాలు, హోమాలతో పాటూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. వెంకటరమణ, సంబుశోభ, సత్యనారాయణ పద్మజా, బాలింగయ్య, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: వాసవీమాత జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్యభవన్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయ గణపతిపూజ నిర్వహించిన అనంతరం కుంకుమార్చన వాసవీమాత హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. జూలూరి సత్యనారాయణ, వెంకటరమణ, భాగ్యలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మన్ననూర్‌లో ఊరేగింపులో ఆర్యవైశ్యులు

లయన్స్ క్లబ్ సేవలు అమూల్యమైనవి



వాటర్ డిస్పెంచరీని అందిస్తున్న రమేశ్

కల్వకుర్తి రూరల్: సమాజంలోని అన్ని వర్గాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి ద్వారా అందిస్తున్న సేవలు అమూల్యమైనవని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ రమేశ్ బాబు అన్నారు. ఆదివారం కల్వకుర్తి క్లబ్ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ డిస్పెంచరీని క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ బాబు మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేశ్ మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వం అనే విధానాన్ని అనుసరించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దాత అప్పాయిపల్లి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు. కార్యదర్శి శ్రీధర్, వెంకటేశ్, కిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధిబుద్ధి గణపతి కల్యాణం



గణపతి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్ గేట్ వద్ద ఆదివారం సిద్ధిబుద్ధి విజయ గణపతి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో స్వామివారికి అభిషేకం చేశారు. హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏడాది స్వామి కల్యాణోత్సవం వైభవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పూజారి జ్యోతి, పంకజ్‌వాజ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

వెల్దండ: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డిని వెల్దండ సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ఆదివారం హైదరాబాద్‌లో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వెల్దండ సింగల్‌విండో అభివృద్ధికి సహకరించాలన్నారు. అకాల వర్షానికి మండలంలో పంటల నష్టపరిహారం తదితర అంశాలను వివరించారు. ధాన్యం నిల్వ కోసం మండలంలో గోదాంలను నిర్మించాలని, సింగిల్ విండో బ్యాంక్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. వెంకటయ్య పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన సర్పంచ్

చారకొండ: సచివాలయం ప్రారంభంలో రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, నిరంజన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును మండలంలోని అగ్రహారం తండా సర్పంచ్ ప్రశాంత్ నాయక్, ఆదివారం సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు.


కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఉప్పునుంతల: మండలంలోని సూర్యతండాలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే కంటి వెలుగు శిబిరాన్ని తండాలో ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బాలునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కంటి చూపు మందగించిన వారికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తారని చెప్పారు.

ఫొటోగ్రాఫర్లు జాగ్రత్తలు పాటించాలి

కందనూలు: పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి ఒక్క ఫొటో, వీడియో గ్రాఫర్స్ అందరూ తగు జాగ్రత్తలు పాటించి, ఈవెంట్స్‌కు వెళ్లాలని నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు వీరేందర్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని, తప్పనిసరిగా ఫొటో గ్రాఫర్స్ యూనియన్ ఐడీ కార్డు తమ వెంటే ఉంచుకోవాలని చెప్పారు. మద్యం తాగి రాత్రిళ్లు వాహనాలు నడపకూడదని, ఆలస్యమైతే స్థానికంగానే ఉండి తర్వాత రోజు ఉదయం తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

మన్ కీ బాత్‌లో మండల ప్రజలు



బిజినేపల్లి: ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన మన్ కీ బాత్ 100వ కార్యక్రమాన్ని మండల ప్రజలు ప్రత్యేకంగా తిలకించారు. ప్రతి ఇంట్లో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ప్రతి గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మహిళలకు కార్యక్రమంపై అవగాహన కల్పించి, కార్యక్రమం వీక్షించేలా చేశారు. మోదీ సందేశాన్ని తెలుగులో వివరించారు.

కాంట్రాక్టు లెక్చరర్ల హర్షం

కందనూలు: కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఫైల్‌పై సీఎం కేసీఆర్ కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా తొలి సంతకం చేయడంపై జిల్లాలోని కాంట్రాక్టు లెక్చరర్లు 711 యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శివ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీధర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.